# ఘనంగా మలుగ అంజయ్య శతావధాన కార్యక్రమం



**హైదరాబాద్, మే 28(నేటి దర్శిని):** తెలంగాణ సాహిత్య అకాడమీ సౌజన్యంతో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, తెలుగు భాష చైతన్య సమితి, గోల్కొండ సాహితీ కళా సమితి, విశ్వభారతి మ్యాక్స్ సొసైటీ లిమిటెడ్, నక్క వెంకటయ్య యాదవ్ -- నక్క యాదగిరి స్వామి యాదవ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సురవరం ప్రతాపరెడ్డి 130వ జయంతి పురస్కరించుకొని నిర్వహించిన మలుగ అంజయ్య శతావధాన కార్యక్రమం ముగింపు సభ ఘనంగా జరిగింది. ప్రముఖ కవి గంట మనోహర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు శ్రీ చిన్నారెడ్డి ముఖ్య అతిథిగా, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి విశిష్ట అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ వైతాళికుడు సురవరం ప్రతాపరెడ్డి పేరును తెలుగు విశ్వవిద్యాలయానికి పెట్టడంలో తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో కృషి చేసిందన్నారు. సురవరం ప్రతాపరెడ్డి చేసిన సేవలకు తగిన గుర్తింపును అందించడంలో ప్రభుత్వం ముందంజలో ఉందన్నారు. ఆయన పత్రికా సంపాదకుడిగా, జర్నలిస్టుగా, రచయితగా విశేష కీర్తి పొందారని, తెలంగాణ నుంచి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు అందుకున్న మహోన్నత మేధావి అని కొనియాడారు. మలుగ అంజయ్య అసాధారణ ధారణాశక్తితో, ఆశువుగా సమస్యలు మరియు దత్తపదులను చాకచక్యంగా సమాధానపరుస్తూ శతావధాన కార్యక్రమాన్ని ఆసాంతం రక్తికట్టించారని ప్రశంసించారు.తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నామోజు బాలాచారి మాట్లాడుతూ సురవరం ప్రతాపరెడ్డి జయంతి ఉత్సవాలను ప్రతి సంవత్సరం తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణలోని కవులు, కళాకారుల పుస్తకాల ముద్రణ, జయంతి ఉత్సవాలు, వివిధ కళారూపాల ప్రోత్సాహానికి అకాడమీ కృషి చేస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో తెలుగు భాష చైతన్య సమితి అధ్యక్షులు బడేసాబ్, ప్రముఖ కవులు గంట మనోహర్ రెడ్డి, రామకృష్ణ చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎడ్ల కల్లేశ్, సంపాదకులు జయప్రకాష్, కార్యదర్శులు ఎల్ జగన్, కే సత్యనారాయణ, తులసి వెంకట రమణాచార్యులు, తూర్పు మల్లారెడ్డి, నక్క శ్రీనివాస్ యాదవ్, తలారి సురేష్, గురునాథం, దాసోజు పద్మావతి, మూర్తి శ్రీదేవి, ప్రముఖ కవయిత్రి రాధా కుసుమ, పాలడుగు సరోజినీ దేవి తదితరులు పాల్గొన్నారు. ఉభయ రాష్ట్రాలకు చెందిన కవులు, అవధానులు, సాహితీ ప్రముఖులు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఘనంగా బక్రీద్ వేడుకలు...



**ఆమనగల్లు,మే28(నేటి దర్శిని):** త్యాగానికి ప్రతీకైనా బక్రీద్ (ఈద్.. ఉల్.. అదా) ను ఆమనగల్లు, కడ్తాల్, మాడుగుల, తలకొండపల్లి, మండల కేంద్రాలతో పాటు గ్రామాలలో గురువారం బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. త్యాగం, సహనం, జాలి, దయ,సేవ,అనే గుణాలను ప్రతిబింబిస్తుందన్నారు. ఆమనగల్లులో వాహేద్ మౌలానా ఆధ్వర్యంలో ప్రత్యేక నమాజ్, సలాం, దువా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రపంచంలోని ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా పడి పాడిపంటలు అభివృద్ధి చెందాలని అల్లాను ప్రార్థించారు.నమాజ్ కోసం ఈద్గా కు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా జామియా మజీద్ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లను చేశారు.వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని చల్లగా పందిళ్ళు వేసి తాగునీటి సౌకర్యాన్ని కల్పించారు.ఈ సందర్భంగా మెడికల్ షాప్ అసోసియేషన్ నాయకులు బిఆర్ఎస్ కౌన్సిలర్ పాపిశెట్టి రాము ఈద్గా వద్దకు వచ్చి ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కో ఆప్షన్ మెంబర్ అబ్దుల్ ఖాదర్,ఆయా మస్జిద్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ మాసూం,గౌస్ మైనుద్దీన్,సభ్యులు జబ్బార్,నయుం,జాంగిర్, రజాక్,మాజీద్ ఖురేషి,అక్రమ్, బాబా,వహీద్,అబ్బాస్, ఆరిఫ్,తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బక్రీద్ (ఈద్-ఉల్-అధా) పండుగ



మిడ్జిల్ ఈద్గా లో భక్తి శ్రద్ధలతో బక్రీద్ పండుగ ప్రార్థనలు







**మిడ్జిల్,మే 28, (నేటి దర్శిని ప్రతినిధి):** మిడ్జిల్ మండలం లోని వివిధ గ్రామాలలో బక్రీద్ పురస్కరించుకొని ముస్లిం సోదరులు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని పండుగ సంతోషాన్ని పంచుకున్నారు ఈ యొక్క కార్యక్రమంలో ముస్లిం సోదరులతో పాటు మండల వాసులు ప్రముఖులు వచ్చి ఒకరినొకరి ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఈ యొక్క కార్యక్రమానికి ఏర్పాట్లు స్థానిక మజీద్ కమిటీ ముస్లిం పెద్దలు ఘనంగా ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ బక్రీద్ (ఈద్-ఉల్-అధా) పండుగ కేవలం జంతు బలి మాత్రమే కాదు.. అపారమైన దైవభక్తికి, నిస్వార్థ త్యాగానికి ప్రతీక. దీని వెనుక ఉన్న స్ఫూర్తిదాయకమైనది. ఇస్లామిక్ చరిత్ర ప్రకారం, దేవుని (అల్లాహ్) ప్రవక్త అయిన హజ్రత్ ఇబ్రహీం (అబ్రహం) తన జీవితంలో భగవంతునిపై అచంచలమైన నమ్మకాన్ని కలిగి ఉండేవారు. ఆయన భక్తిని పరీక్షించడానికి అల్లాహ్ కలలో కనిపించి, తనకు అత్యంత ప్రియమైన దానిని త్యాగం చేయమని ఆదేశిస్తాడు. ఇబ్రహీంకు తన ఏకైక కుమారుడైన ఇస్మాయిల్ అంటే ప్రాణం.అయినా సరే, దేవుని ఆజ్ఞే తనకు ముఖ్యం అని భావించి, తన కుమారుడిని బలి ఇవ్వడానికి సిద్ధపడతాడు. ఇస్మాయిల్ కూడా తండ్రి నిర్ణయాన్ని గౌరవించి, అల్లాహ్ కోసం తన ప్రాణాలను అర్పించడానికి ఎలాంటి సందేహం లేకుండా ఒప్పుకుంటాడు. తన కుమారుడి మెడపై కత్తి పెట్టబోయే చివరి క్షణంలో, ఇబ్రహీం కళ్ళు గట్టిగా మూసుకుంటాడు. కానీ, ఆయనకున్న అపారమైన దైవభక్తికి మెచ్చిన అల్లాహ్.. ఆ బలిని అంగీకరించి, ఒక దేవదూత (జిబ్రాయిల్) ద్వారా ఆ కుమారుడి స్థానంలో ఒక మూగజీవాన్ని (గొర్రెను) అక్కడ ప్రత్యక్షమయ్యేలా చేస్తాడు. ఇబ్రహీం తెరిచి చూసేసరికి కుమారుడు క్షేమంగా ఉంటాడు, బదులుగా గొర్రె బలి ఇవ్వబడుతుంది. ఈ సంఘటన మానవాళికి ఒక గొప్ప సందేశాన్ని ఇస్తుంది. అదేంటంటే, 'భగవంతుడిపై మనకు ఉన్న ప్రేమ, మన స్వార్థం కంటే గొప్పది'. ఈ త్యాగాన్ని స్మరించుకుంటూనే బక్రీద్ రోజున 'ఖుర్బానీ' ఇస్తారు. ఆ త్యాగం చేసిన మాంసాన్ని మూడు సమాన భాగాలుగా చేసి.. ఒక భాగం పేదలకు, రెండో భాగం బంధుమిత్రులకు, మూడో భాగం తమ కుటుంబానికి పంచుకుంటారు. దీని ద్వారా తోటివారి ఆకలి తీర్చడం, సమాజంలో ప్రేమ, దయ, పంచుకునే గుణం పెంపొందుతాయి అని తెలియజేశారు.

# బక్రీద్ సందర్భంగా ఈద్గా వద్ద బందోబస్తు ఏర్పాట్లు

- పరిశీలించిన మహబూబ్ నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి ఐపీఎస్





**మిడ్జిల్, మే 28, ( నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** బక్రీద్ పండుగ సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని ఈద్గా వద్ద ఏర్పాటు చేసిన బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ డి. జానకి ఐపీఎస్ పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ, పార్కింగ్ సదుపాయాలు మరియు ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీసుకుంటున్న చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు.అలాగే జిల్లాలోని అన్ని ఈద్గా ప్రాంగణాల వద్ద పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. పండుగ సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి. జానకి ఐపీఎస్ జిల్లా ప్రజలకు, ముఖ్యంగా ముస్లిం సోదరులు, సోదరీమణులందరికీ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. బక్రీద్ పండుగను సోదరభావంతో, ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.బందోబస్త్ నందు అదనపు ఎస్పి చీదీ రత్నం,~ా= అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఐఖ్రా వెంకటేశ్వర్లు, ఐజ=దీ ఐఖ్రా రమణా రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ అప్పయ్య, ూదీ ఇన్స్పెక్టర్ మోతిరాం, జజూ ఆఅంజూవషీశీతీ కృష్ణ, ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ రాజేందర్ రెడ్డి మరియు ఇతర అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

# అధిక మాసంలో వృద్ధాశ్రమంలో అన్నదాన సేవ నిర్వహించిన శ్రీ కృష్ణ గోపాల్ సేవా సమితి







**ఎల్.బి.నగర్,మే28 (నేటి దర్శిని):** అధిక మాసం సందర్భంగా శ్రీ కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం వృద్ధాశ్రమంలో మధ్యాహ్న భోజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు కపిల్ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ, అధిక మాసంలో చేసే ప్రతి దానం మన జీవితాల్లో ఆనందం, శుభఫలితాలు తీసుకువస్తుందని తెలిపారు. సమాజ సేవే లక్ష్యంగా తమ సమితి తరఫున వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాలు మరియు పేదవారి బస్తీలలో ప్రతిరోజూ వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. సమాజంలో అవసరమైన వారికి సహాయం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి ట్రెజరర్ ఖుష్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీ మనోజ్ గుప్తా, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్ సునీల్ ధరాడే, సంజయ్ ధనావత్ మరియు సతీష్ యాదవ్ సేవా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కేబుల్ ఛానల్ రిపోర్టర్లకు న్యాయం చేస్తానన్న మంత్రి పొంగులేటి



**హైదరాబాద్, మే28 (నేటి దర్శిని):** తెలంగాణ రాష్ట్రంలో కేబుల్ టీవీ న్యూస్ చానల్ లో పని చేస్తున్న జర్నలిస్టులందరికీ న్యాయం చేయడానికి తమ ప్రభుత్వ సిద్ధంగా ఉందని రాష్ట్ర సమాచార రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు.కేబుల్ టీవీ ఛానల్ ప్రతినిధులు బుధవారం ఆయనను సెక్రటేరియట్ లో కలిసి తమ విలేకరులకు అక్రిడేషన్ కేటాయింపు విషయంలో అన్యాయం జరుగుతుందని అపోహ ఉన్నదని వాటిని తొలగించాలంటే జిల్లాలో ని అన్ని నియోజకవర్గాలలో పనిచేస్తున్న ప్రతి రిపోర్టర్ కు అక్రిడేషన్ సదుపాయం కల్పించాలని వారు మంత్రిని కోరారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తమ ప్రభుత్వం ప్రతి జర్నలిస్టుకు న్యాయం చేస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కేబుల్ టీవీ జర్నలిస్ట్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు నరసింహ చారి పొదిల వెంకట్ ఆషిక్ పాషా భరత్ కుమార్ బ్రహ్మం శ్రీనివాస్ మహేష్ కిషోర్ బాలు రవికుమార్ నాగేంద్ర చారి వెంకటరెడ్డి మహేష్ ఉపాధ్యాయ శ్రీనాథ్ క్రాంతి రాము వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ 103వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



**వనస్థలిపురం, మే28 (నేటి దర్శిని):** భారతరత్న, మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినీనటుడు నందమూరి తారకరామారావు (ఎన్టీఆర్) 103వ జయంతి సందర్భంగా ఎల్బీనగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి వనస్థలిపురం పనామా వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహానేత ఎన్టీఆర్ గారి సేవలను స్మరించుకున్నారు. ప్రజా సేవలోనూ, సినీ రంగంలోనూ ఎన్టీఆర్ చూపిన మార్గం భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, తెలుగు ప్రజల గౌరవం కోసం ఎన్టీఆర్ చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, వివిధ డివిజన్ల పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## యువత, మహిళలు, వృద్ధుల ఆరోగ్యానికి ఓపెన్ జిమ్‌లు అవసరం: కళ్లెం నవజీవన్ రెడ్డి

- కమలానగర్ పార్క్ అభివృద్ధిపై మాజీ కార్పొరేటర్ ప్రత్యేక దృష్టి



**హయత్‌నగర్, మే 28 (నేటి దర్శిని):** ఉమ్మడి హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని కమలానగర్ కాలనీలో తన హయాంలో మంజూరైన నిధులతో ఏర్పాటు కానున్న ఓపెన్ జిమ్ పనులను స్థానిక మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పార్క్ పరిసరాలను పరిశీలిస్తూ అభివృద్ధి పనులపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రతి కాలనీలో పార్కులు, వాకింగ్ ట్రాక్‌లు, ఓపెన్ జిమ్‌లు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండాలని అన్నారు. యువతతో పాటు మహిళలు, వృద్ధులు కూడా ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకునేందుకు ఇటువంటి వసతులు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. కమలానగర్ కాలనీ ప్రజలు ఎంతోకాలంగా కోరుకుంటున్న ఓపెన్ జిమ్ ఏర్పాటుకు తమ హయాంలో నిధులు మంజూరు చేయడం ఆనందంగా ఉందని తెలిపారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అలాగే పార్క్ పరిసరాలను మరింత అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు మదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, సంక్షేమ సంఘ సభ్యులు సంగ్రామ్, టీవీ రావు, భరత్ సింగ్, జగదీశ్వర్, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను మీసేవకు ఇవ్వబోమని స్పష్టం చేసిన ఎమ్మెల్యే




**చైతన్యపురి, మే 28 (నేటి దర్శిని):** చైతన్యపురి డివిజన్ పరిధిలోని వికాస్ నగర్ కాలనీలో ఉన్న మీసేవ భవనాన్ని పోలీస్ స్టేషన్ కోసం, అలాగే న్యూ దిల్‌సుఖ్‌నగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌ను మీసేవ కార్యాలయంగా వినియోగించేందుకు జీహెచ్ఎంసీ మరియు పోలీస్ అధికారులు ప్రయత్నిస్తున్నారని కాలనీవాసులు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి కాలనీకి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అనంతరం డీసీ శ్రీనివాస్‌ను పిలిపించి, దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ మీసేవ కార్యాలయానికి కేటాయించబోమని స్పష్టం చేశారు. కాలనీవాసుల ప్రయోజనాల కోసం తాను అండగా నిలుస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్‌తో కూడా ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు. అనంతరం మీసేవ మరియు వార్డ్ కార్యాలయాన్ని సందర్శించి తాళం వేయించారు. మీసేవ కమిషనర్ రవికిరణ్‌తో కూడా మాట్లాడి కాలనీవాసులకు న్యాయం జరుగుతుందని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో చైతన్యపురి డివిజన్ మాజీ కార్పొరేటర్ విట్టల్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, న్యూ దిల్‌సుఖ్‌నగర్ కాలనీవాసులు సుష్మిత, రోజా పద్మిని, భవాని నగర్ కాలనీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, వికాస్ నగర్ కాలనీ అధ్యక్షులు వెంకటేష్, శోభారాణి, పవన్ సంతోష్, తులసి కృష్ణ, గట్టు శ్రీను, రమణారెడ్డి, జలంధర్, కిరణ్, నరేష్, శ్రీధర్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## ధాన్యం కొనుగోలులో జాప్యంపై
# రైతు వినూత్న నిరసన..

- తోపుడు బండిపై 7 కి.మీ ధాన్యం తరలింపు
- కొలనుపాక కొనుగోలు కేంద్రంలో పేరుకుపోయిన ధాన్యం కుప్పలు
- చెప్పులు లేకుండా తోపుడు బండి నెడుతూ రైతు మణిపాల్ రెడ్డి ఆవేదన





**యాదాద్రి,మే28 (నేటి దర్శిని):** యాదాద్రి భువనగిరి జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జరుగుతున్న జాప్యాలకు నిరసనగా కందాడి మణిపాల్ రెడ్డి అనే రైతు వినూత్న రీతిలో ఆందోళన చేపట్టాడు. చందేపల్లి గ్రామానికి చెందిన రైతు మణిపాల్ రెడ్డి తన ధాన్యం బస్తాలను తోపుడు బండిపై వేసుకుని కొలనుపాక ధాన్యం కొనుగోలు కేంద్రం నుంచి ఆలేరు మార్కెట్ యార్డు వరకు సుమారు ఏడు కిలోమీటర్ల దూరం కాలినడకన తరలిస్తూ అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసించాడు. కొలనుపాక ధాన్యం కొనుగోలు కేంద్రంలో గత పది రోజులుగా ధాన్యం కుప్పలు పేరుకుపోయినప్పటికీ అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే కాంటా వేసిన ధాన్యాన్ని కూడా రవాణా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా స్పందన లేకపోవడంతో రైతు మణిపాల్ రెడ్డి ఈ వినూత్న నిరసనకు దిగినట్లు తెలిపారు. ధాన్యం బస్తాలను తోపుడు బండిపై ఎక్కించుకుని, కాళ్లకు చెప్పులు లేకుండా మండుటెండలో నడుస్తూ ఆయన నిరసన తెలపడం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, రైతుల సమస్యలను పరిష్కరించాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. రైతులు కష్టపడి పండించిన ధాన్యాన్ని సమయానికి కొనుగోలు చేయకపోవడం వల్ల తీవ్ర నష్టాలు వస్తున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం తరలింపు, కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని రైతులు కోరుతున్నారు.

## స్వర్ణకారులకు ప్రత్యేకంగా
# కార్పొరేషన్ ఏర్పాటు చేయండి

- కాంగ్రెస్ సీనియర్ నేత ముద్దాని రామ్మోహన్ గౌడ్ విజ్ఞప్తి



**ఎల్.బి.నగర్, మే28 (నేటి దర్శిని):** చాలా సంవత్సరాలుగా స్వర్ణకారులు అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారని, వారి సంక్షేమం కోసం ప్రత్యేకంగా కృషి చేయడంతో పాటు స్వర్ణకారులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని సీనియర్ కాంగ్రెస్ నేత ముద్దాని రామ్మోహన్ గౌడ్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వింజమూరి రాఘవాచారి తో కలిసి టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేసి స్వర్ణకారుల సమస్యలు ఆయనకు వివరించారు. స్వర్ణకారుల కార్పొరేషన్ విషయంపై సీఎం దృష్టికి తీసుకెళ్తానని మహేష్ కుమార్ గౌడ్ వారికి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ మాట్లాడుతూ స్వర్ణకారులు రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగ ఉపాధి కరువై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఇటీవల పలువురు స్వర్ణకారులు ఉపాధి కరువై ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని మహేష్ కుమార్ గౌడ్ వివరించారు. వారికి స్వర్ణకారుల కార్పొరేషన్ ఏర్పాటు చేయడం ద్వారా కొంత ఊరట కలుగుతుందని పేర్కొన్నారు. స్వర్ణకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వింజమూరి రాఘవాచారి మాట్లాడుతూ... గత ప్రభుత్వం తమకు హామీ ఇచ్చి విస్మరించడంతోనే బీఆరెస్ పార్టీని తిరిగి అధికారంలోకి రాకుండా చేశామని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి తమ అందరం ఐక్యంగా ఉండి కాంగ్రెస్ పార్టీకి మద్దతు తెలిపామని వివరించారు. ఇకనైనా కాంగ్రెస్ పెద్దలు కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి స్వర్ణకారుల కార్పోరేషన్ ఏర్పాటుకు కృషి చేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు వింజమూరు రాఘవా చారి, రాష్ట్ర కార్యదర్శి రాగిఫణి సతీష్ కుమార్ చారి, రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు నారోజు సత్యం మనోరమ రాష్ట్ర సహాయ కార్యదర్శిలు కన్నకంటి రామాచారి, మడిపోజు శివయ్య చారి, ఇడికోజు గిరిధరాచారి. తదితరులు పాల్గొన్నారు

## ప్రపంచ రికార్డు గుర్తింపుతో పాటు అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్న బి.రాజ్‌కుమార్





**ఇబ్రహీంపట్నం, మే28(నేటి దర్శిని ) :** సామాజిక సేవా, సాంస్కృతిక కార్యక్రమాల్లో విశిష్ట సేవలు అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షుడు బి.రాజ్‌కుమార్ అరుదైన గౌరవాన్ని అందుకున్నారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతి వేడుకల సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు "అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు--2026" ప్రదానం చేశారు. కళానిలయం సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో హైదరాబాద్ అబిడ్స్‌లోని తెలంగాణ సరస్వత పరిషత్‌లో నిర్వహించిన ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమంలో ఒకే వేదికపై 135 మంది కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించిన సందర్భంగా ఏర్పాటుచేసిన విశేష కార్యక్రమానికి రాజ్‌కుమార్ అందించిన సేవలను గుర్తిస్తూ గోల్డెన్ స్టార్ వరల్డ్ రికార్డ్స్ ఫోరం సర్టిఫికేట్‌ను అందజేసింది. ఈ సందర్భంగా రాష్ట్ర మాజీ స్పీకర్ మధుసూదనాచారి చేతుల మీదుగా ఆయన అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమం ప్రపంచ రికార్డు స్థాయిలో గుర్తింపు పొందినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా బి.రాజ్‌కుమార్ మాట్లాడుతూ... తనకు లభించిన ఈ గౌరవాలు సమాజ సేవకు మరింత ప్రేరణనిస్తాయని అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తూ సామాజిక అభివృద్ధికి తన వంతు కృషి కొనసాగిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, సాంస్కృతిక రంగ ప్రముఖులు పాల్గొని బి.రాజ్‌కుమార్‌ను అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేసి ఘనంగా సత్కరించారు. కాగా, రాజ్‌కుమార్ కుమారుడు, ఎన్ఎస్‌యూఐ నాయకుడు బి.వినయ్ కుమార్ కూడా అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా ప్రదానం చేసిన "అంబేద్కర్ ఎక్సలెన్సీ అవార్డు--2026" అందుకోవడం విశేషం. తండ్రి, కుమారుడు ఒకే కార్యక్రమంలో ప్రతిష్టాత్మక అవార్డులు అందుకోవడంతో కుటుంబ సభ్యులు, మిత్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి అవార్డులు, ప్రశంస పత్రాలు మరిన్ని అందుకోవాలని పలువురు ఆకాంక్షించారు.

